హైడ్రా అధికారుల నోటీసులతో కొత్తపేటలో జరిగిన ఆందోళనలో సొమ్మసిల్లిన జ్యోతిని దవాఖానకు తరలిస్తున్న స్థానికులు

చైతన్యపురిలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేస్తున్న మహేశ్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

హైడ్రా గోబ్యాక్.. సీఎం డౌన్ డౌన్!

మొదటిపేజీ తరువాయి...

నెలకొన్నాయి. ఎక్కడ చూసినా ప్రజల ఆందోళనలు.. హోరెత్తిన నినాదాలతో కాలనీలన్నీ అట్టుడుకిపోయాయి. సర్వే అధికారులపై శుక్రవారం ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్నది. అడుగడుగునా నిరసనలతో సర్వే ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. చైతన్యపురిలో ఓ యువకుడు తన చావే సమస్యకు పరిష్కారమని పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేయడం కాలనీవాసుల మనోవేదనకు ప్రత్యక్ష నిదర్శనంలా చెప్పాలి. పాతనగరంలో మూసీ రివర్‌బెడ్‌లో ఏ కాలనీ చూసినా.. ఏ బస్తీని కదిలించినా ప్రతీ ఒక్కరి నుంచి ఒకటే మాట.. రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్.. హైడ్రా గో బ్యాక్. తమ ప్రాంతంలో అడుగుపెడితే ఖబర్దార్ అంటూ అధికారులకు స్థానికులు హెచ్చరికలు జారీ చేసి సర్వే చేయకుండా తరిమికొట్టారు. హైడ్రా సర్వేకు వ్యతిరేకంగా బాధితులు రోడ్డెక్కారు.

రోడ్లపై బైఠాయింపు.. భారీగా ట్రాఫిక్‌జామ్

మూసీ పరివాహక ప్రాంతంలో అధికారులు చేపట్టిన సర్వే ఉద్రిక్తంగా మారుతోంది. వరుసగా రెండో రోజు ఆందోళనలకు దిగిన స్థానికులు శుక్రవారం నిరసనను తీవ్రతరం చేశారు. వందల మంది రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో పురానాపూల్ నుంచి లంగర్‌హౌజ్ వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. మరోవైపు లంగర్‌హౌజ్ పిల్లర్ నెంబర్102 వద్ద ఆశంనగర్ కాలనీ, డిఫెన్స్ కాలనీ వాసులు బైఠాయించారు. దీంతో రాజేంద్రనగర్ నుంచి మెహదీపట్నం వైపు పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. బడాబాబులను వదిలేసి సామాన్యుల జోలికి వస్తున్న నువ్వు సర్వనాశనమైపోతవ్

కొత్తపేటలోని మూసీ పరివాహకంలో కూల్చివేతలకు సంబంధించి ఎఫ్‌టీఎల్ మ్యాప్‌ను చూపుతున్న భూబాధితుడు

రేవంత్‌రెడ్డి అంటూ శాపనార్థాలు పెట్టారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ ఇక్కడినుంచి వెళ్లేదేలేదని ఖరాఖండిగా చెప్తున్నారు. ప్రజాపాలన, ఇందిరమ్మపాలన అంటే ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. న్యాయం జరిగేవరకు కదిలేదిలేదని బైఠాయించడంతో పోలీసులు వారిని సముదాయించే ప్రయత్నంచేశారు. హైదరాబాద్ పాతనగరంలోని కిషన్‌బాగ్, అసద్ బాబానగర్, నందిముసలైగూడ మూసీరివర్‌బెడ్‌లోని నివాసితులంతా ర్యాలీగా వచ్చి బహదూర్‌పురా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తమ ఇళ్లనుకూల్చవద్దని తమకు డబుల్‌బెడ్రూం అవసరం లేదని తేల్చిచెప్పారు.

ప్రజల తిరుగుబాటు

మూసీ రివర్ బెడ్ ఏరియాలో ఉన్న ఇండ్లపై మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారులపై ప్రజలు ఒక్కసారిగా తిరగబడ్డారు. మూసీ పరివాహక ప్రాంతానికి సుమారు 100 మీటర్ల ఎత్తులో ఉన్న ఇండ్లను ఖాళీ చేయాలనడం ఎంత వరకు సమంజసమని ప్రజలు ప్రశ్నించారు. తాము నిర్మించుకున్న ఇండ్ల ఎత్తుకు మూసీ నది నీరు చేరుకున్నట్లయితే దిగువన ఏ గ్రామం మిగలదని.. తమ ఇండ్లను కూల్చి రియల్ ఎస్టేట్ దందా చేసేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడని ప్రజలు ఆరోపించారు. ప్రజల నుంచి తీవ్రమైన నిరసనలు, వ్యతిరేకత ఎదురవ్వడంతో అధికారులు ఆయా ప్రాంతాలనుంచి వెనుదిరిగారు. లంగర్‌హౌజ్‌లో ఏకంగా అధికారుల పైకి దాడికి పాల్పడేయత్నం చేయడంతో అధికారులు భయంతో వెళ్లిపోయారు. న్యూమారుతీనగర్ నార్త్ కాలనీతో పాటు ఇతర ప్రాంతాల్లో అధికారులు వేసిన మార్కింగ్‌లను ప్రజలు తొలగించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మూసీ పరివాహకంలో పర్యటిస్తున్న అధికారులకు అడుగడుగునా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మహిళలు అధికసంఖ్యలో వచ్చి అధికారులతో గొడవలకు దిగుతున్నారు. ఆందోళనకారులు అధికారులపై తిరగబడడంతో సర్వేచేయకుండానే వెనుదిరుగుతున్నారు. అత్తాపూర్‌లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ఆ తర్వాత మార్కింగ్ చేస్తామని చెప్పారు. దీంతో మహిళలంతా ఒక్కసారిగా తిరగబడ్డారు. సర్వే చేయొద్దని రాజేంద్రనగర్ తహసీల్దార్ సిబ్బందిని, మున్సిపల్ అధికారులను మహిళలు హెచ్చరించారు. 'మీ అన్న తిరుపతిరెడ్డి ఇల్లు కూలగొట్టవా.. మా ఇళ్లే మన్నా నీ అయ్య జాగీరా' అని రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. మా ఇళ్లుకూలగొడ్తే మేమెక్కడికి పోవాలని గుండెలవిసేలా రోదించారు. కొత్తపేట, చైతన్యపురిడివిజన్ల పరిధిలోని భవానీనగర్, వినాయక్‌నగర్, ఫణిగిరికాలనీ, సత్యానగర్, న్యూమారుతినగర్ నార్త్ కాలనీలో మూసీ సర్వేకు వచ్చిన అధికారులను స్థానికులు అడ్డగించారు. మా ఇళ్లు కూల్చొద్దు.. మాకు కరెంట్, వాటర్ సప్లై ఉన్నయ్.. అన్నిరకాల రిజిస్ట్రేషన్లు ఉన్నాయ్.. ఇప్పుడెందుకు వచ్చారు అని నిలదీశారు. చైతన్యపురిలో ఓ యువకుడు పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్యాయత్నం చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. 'నా భార్య 9నెలల కడుపుతో ఉంది.. మా ఇల్లు కూలగొడ్తే మేము ఎక్కడకుపోవాలి.. పట్టా భూమిలోనే ఇల్లుకట్టుకున్నాం.. కరెంట్ బిల్లు, ఇంటిపన్ను అన్నీ కడుతున్నం అంటూ తన పత్రాలు చూపిస్తూ ఆ యువకుడు ఏడుస్తుంటే చుట్టుపక్కల వాళ్లు ధైర్యం చెప్పే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో ఓ మహిళ స్పృహ తప్పి పడిపోయింది.

హైడ్రా అధికారుల నుంచి నోటీసులు అందుకున్న చైతన్యపురిలోని కొత్తపేటకు చెందిన రాధ కుటుంబం. ఆమెకు ముగ్గురు కూతుళ్లు ఉండడంతో వారి పెండ్లిళ్లు చేసేదెలా అని అధికారులను వేడుకున్నారు. అయినా కనికరించకపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు.

అత్తాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద ర్యాలీ నిర్వహించి ధర్నా చేస్తున్న మూసీ నాలా బాధితులు

బుల్డోజర్ హెచ్చరిక.. బుచ్చమ్మ లేదిక!

మొదటిపేజీ తరువాయి...

ప్రాణం తీసుకోవడం సంచలనంగా మారింది. హైదరాబాద్ కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనతో విషాదం నిండుకున్నది. కూకట్‌పల్లి రామాలయానికి చెందిన గుర్రంపల్లి శివయ్య, బుచ్చమ్మ దంపతులు కూలిపనులతో జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కూతుళ్లు. ముగ్గురికీ వివాహాలు చేసి కట్నం కింద నల్ల చెరువు వద్ద ఉన్న ఇంటిని ఇచ్చారు. కూల్చివేతల్లో భాగంగా నల్ల చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు ఇండ్లు ఖాళీ చేయాలని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో కూతుళ్లకు ఇచ్చిన ఇల్లు కుల్చివేస్తే బిడ్డలు రోడ్డున పడుతారనే మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో బుచ్చమ్మ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. కుటుంబసభ్యులు దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. సమాచారం అందుకున్న కూకట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లు కూలుస్తరనే తట్టుకోలేకే..

'మా అమ్మ జీవితాంతం నాన్నతో కలిసి కూలిపనులు చేసి, రూపాయి రూపాయి కూడేసి ఇల్లు కట్టించింది. ఇప్పటికీ రెక్కల కష్టంతోనే బతుకుతున్నరు. ముగ్గురు ఆడపిల్లల పెండి చేసిండ్రు. ఇల్లు ముగ్గురికీ కట్నంగా ఇచ్చిండ్రు. ఒక్కసారిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూల్చివేస్తామని అనేసరికి పాణందీసుకున్నది' అని బుచ్చమ్మ కూతుళ్లు, ఇతర కుటుంబ సభ్యులు రోదిస్తూ చెప్పారు. ఆమె ఆత్మహత్య చేసుకునే మనిషి కాదు. చాలా ధైర్యవంతురాలు ఆమె. ఇట్ల చేసుకుంటదని అనుకోలేదు. కొడుకులు లేకున్నా మాకున్న ఇల్లును చూసి పిల్లలు మంచిగ ఉంటారు కదా అనుకుంటూ ఉండేది. కూల్చివేస్తారన్న విషయాన్ని విని ఆమె తట్టుకోలేకపోయింది. మాకు కూడా ఆడపిల్లలే కలిగారు. వారి భవిష్యత్తు కూడా ఈ ఇంటిమీదే ఆధారపడి ఉన్నదన్న బెంగ ఉండేది. ఈ ప్రభుత్వానికి ఏది న్యాయమో అర్థం కావడంలేదు. పేద ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నది' అని ఆవేదన వ్యక్తం చేశారు. బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నదన్న సమాచారంతో బంధువులు, స్థానికుల రోదనలు మిన్నంటాయి. భర్త, కూతుళ్లను ఓదార్చే ప్రయత్నం చేశారు. ఎన్నో ఆశలతో సొంతంగా కష్టపడి కట్టుకున్న ఇంటిని ఒక్కసారిగా ప్రభుత్వం కూల్చివేస్తుందన్న భయమే ఆమెను వెంటాడి ఈ స్థితికి చేర్చిందని స్థానికులు వాపోయారు.

కూకట్‌పల్లి రామలయం సమీపంలోని యాదవ బస్తీలో రోదిస్తున్న గుర్రంపల్లి బుచ్చమ్మ కుటుంబ సభ్యులు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని సాకి చెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు

పటాన్‌చెరులో హైడ్రా యాక్షన్

సాకి చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాల గుర్తింపు • 18 ఇండ్ల యజమానులకు నోటీసులు

ఇండ్లపై రెడ్ మార్కింగ్ వేసిన అధికారులు • భయంతో వణికిపోతున్న బాధితులు

పటాన్‌చెరు, సెప్టెంబర్ 27: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో హైడ్రా యాక్షన్ ఉండబోతుందా? ఈ ఆదివారం అదే ప్రత్యేకం కావచ్చా? అంటే అవుననే సంకేతాలు పటాన్‌చెరు సాకీ చెరువు వద్ద వినిపిస్తున్నాయి. శుక్రవారం హైడ్రా అధికారుల బృందం వచ్చి సాకి చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మించినట్టు గుర్తించిన భవనాలకు ఎర్ర సిరా మార్క్ వేసింది. దీంతో ఆ భవన యజమానుల గుండెల్లో గుబులు రేకెత్తిస్తున్నది. హైడ్రా ఆదేశాలతో జీహెచ్‌ఎంసీ పటాన్‌చెరు సిబ్బంది.. ఇండ్ల యజమానులకు శుక్రవారం నోటీసులను అందజేశారు. దీంతో వారంతా హడావుడిగా ప్రముఖ నేతలను కలిసి కాపాడాలని విన్నవించుకుంటున్నారు. 2021లో అధికారులు సాకీ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న అక్రమ నిర్మాణాలను సర్వే చేసి గుర్తించారు. 18 అక్రమ నిర్మాణాలు చెరువులో ఉన్నాయంటూ నోటీసులు ఇచ్చారు. ఆగస్టు 31న హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా పటాన్‌చెరుకు వచ్చి సాకి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చెరువు ఎఫ్‌టీఎల్‌లో, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాల గురించి అధికారుల వద్ద వివరాల తీసుకున్నారు. కొన్ని నిర్మాణాలపై కోర్టు కేసులు ఉన్నాయని అధికారులు, స్థానికులు తెలపడంతో వాటి వివరాలు సేకరించి వెళ్లిపోయారు.

ఆరుగురికి హైకోర్టు ఆర్డర్?

గతంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చెన్నై విభాగం సైతం సాకి చెరువులోని ఆక్రమణలను తొలిగించాలని జీహెచ్‌ఎంసీని ఆదేశించింది. దానిపై చర్యలకు ఆనాటి అధికారులు వెనుకాడారు. ఇప్పుడు హైడ్రా యాక్టివ్‌గా చెరువుల్లో ఆక్రమణలు తొలిగిస్తుండటంతో ఆరుగురు హైకోర్టు నుంచి కూల్చివేతలను నిలిపివేసేందుకు ఆర్డర్ తెచ్చుకున్నట్టుగా ప్రచారం జరుగుతున్నది. అటు జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్, ఇటు పటాన్‌చెరు తహసీల్దార్ తమకు కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదని స్పష్టం చేశారు. కోర్టు ఆర్డర్లలో ఏమున్నది? ఎంతవరకు ఆ ఆర్డర్లు హైడ్రా చర్యలను నిలువరించగలవు అనేది ఆసక్తికరంగా మారింది.

లోకం పోకడ



కేసులు పెడ్తం.. లోపలేస్తం

స్థానికులకు పోలీసుల బెదిరింపులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): మూసీ రివర్‌బెడ్‌పై సర్వేకు వచ్చిన అధికారులకు స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దీంతో పోలీసు భద్రతతో అధికారులు సర్వే చేస్తున్నారు. ఈ సమయంలో ఆందోళన చేస్తున్న స్థానికులను పోలీసులు బెదిరిస్తున్నారు. బలవంతంగా పక్కకు తీసుకెళ్లి .. మీరు పక్కకు తప్పుకోకపోతే అరెస్టులు తప్పవు.. కేసులుంటాయి... జైళ్లలో పడేస్తం.. కోర్టుల చుట్టూ తిరగాలి.. అంటూ బెదిరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎవరైతే స్థానిక ఆందోళనకు నాయకత్వం వహిస్తున్నారో వారికి ప్రత్యక్షంగా పరోక్షంగా కూడా బెదిరింపులు వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వంతో పెట్టుకుంటే లోపలికి పోవాలంటున్న అధికారులకు ప్రజలే గట్టిగా సమాధానం చెప్పడానికి ప్రయత్నిస్తున్నా.. పోలీసుల జులుం ముందు అది పనిచేయడం లేదు. తమ ప్రశ్నలకు సమాధానాలివ్వాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను స్థానికులు అడుగుతుంటే అడుగడుగునా పోలీసులే అడ్డుపడుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ లేదని.. ఇపుడు అంతా పోలీస్ రాజ్యమేనని వారు మండిపడుతున్నారు.

నేడు, రేపు కూల్చివేతలు

బుల్డోజర్ టీమ్‌లకు అర్ధరాత్రి సందేశాలు

అధికారులతో హైడ్రా అత్యవసర సమావేశం

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 27(నమస్తే తెలంగాణ): ఒకవైపు మార్కింగులపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటుంటే.. మరోవైపు మూసీ పరివాహక ప్రాంతాలపై హైడ్రా కత్తులు నూరుతున్నది. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో శుక్రవారం ఇంజినీరింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖలతో పాటు నేషనల్‌ఏజెన్సీల ప్రతినిధులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ అంతర్గతంగా అత్యవసరంగా సమావేశమయ్యారు. మూసీ పరివాహక ప్రాంతాలలో హైడ్రా కూల్చివేతలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకున్నది. శని, ఆదివారాల్లో 14టీమ్‌లతో కూల్చివేతలకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ సందర్భంగా కూల్చివేతలకు కొన్ని కీలక అంశాలు సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. మూసీ రివర్‌బెడ్‌లోని పలు కాలనీల్లో సర్వే మార్కింగ్ వెంటవెంటనే చేసి ఆ తర్వాత వనస్థలిపురంలో కొందరిని డబుల్‌బెడ్రూం ఇళ్లలోకి తరలింపు వంటివి తూతూమంత్రంగా చేపట్టారు. శనిఆదివారాల్లో ఎవరూ కోర్టుకు వెళ్లకుండా పూర్తి పకడ్బందీ ప్రణాళికతో భారీ పోలీసు బందోబస్తుతో కూల్చివేతలకు బుల్డోజర్లు సిద్ధం చేశారు. శుక్రవారం మధ్యాహ్నమే టీమ్స్ అన్నింటినీ సిద్ధం చేసి కూల్చివేసే ఏరియాలు మాత్రం అర్ధరాత్రి వారి పర్సనల్ వాట్సప్ గ్రూప్‌లో పంపిస్తామని చెప్పినట్టు తెలిసింది. సమావేశంలో ఎఫ్‌టీఎల్ పరిధికి సంబంధించి చర్చించినా.. రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల వద్ద ఉన్న మ్యాప్‌ల్లో చాలా తేడాలుండడం సమస్యలు తెచ్చిపెడుతుందని కమిషనర్ అన్నట్టు తెలిసింది.

సర్కారుది 'హైడ్రా'మా

హామీల నుంచి దృష్టి మరల్చేందుకే కూల్చివేతలు

బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం అలవికాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు హైడ్రా పేరిట డ్రామాలకు తెరలేపిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పేరుతో పేదల ఇండ్లు, గుడిసెలను కూల్చుతున్న సర్కారుకు.. పెద్దల ఇండ్లు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. మూసీ బెల్ట్‌లో ఇండ్లను కూల్చివేసేందుకు హైడ్రా అధికారులు నోటీసులు జారీ చేయగా, ధర్నాకు దిగిన బాధితులను బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం పరామర్శించారు. అనంతరం మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. మూసీ ఒడ్డున ఎఫ్‌టీఎల్ అని తెలియక ఎంతోమంది పేదలు అక్కడ స్థలాలను కొనుక్కొని ఇండ్లు కట్టుకున్నారని, ఇప్పుడు వాటిని కూల్చివేయడం ఎంతవరకు కరెక్ట్ అని మండిపడ్డారు. సీఎం సోదరుడి ఇంటిని ఎందుకు కూల్చడం లేదని నిలదీశారు. కూల్చివేతలను ఆపకపోతే బీజేపీ తరపున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రూప్-1 నోటిఫికేషన్ రద్దుపై హైకోర్టులో విచారణ

హైదరాబాద్, సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2022 నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో నోటిఫికేషన్ జారీపై హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ కార్తీక్ శుక్రవారం విచారణ ప్రారంభించారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదనలు వినిపిస్తూ.. 503 పోస్టుల భర్తీ కోసం 2022లో నోటిఫికేషన్ జారీ అయిన ప్పటికీ వివిధ కారణాలతో పరీక్ష రద్దయిందని తెలిపారు. ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేయకుండా మరో 60 పోస్టులను కలిపి కొత్త నోటిఫికేషన్‌ను జారీ చేయడం చెల్లదన్నారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ.. టీజీపీఎస్సీ రాజ్యాంగబద్ధమైన సంస్థ అని, పరీక్షను రద్దుచేసి తాజాగా నోటిఫికేషన్ జారీచేసే అధికారం టీజీపీఎస్సీకి ఉంటుందని చెప్పారు. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు ప్రకటించింది.

30 ఏండ్లుగా ఉంటున్నం

30 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఇప్పుడు వచ్చి ఇల్లు ఖాళీ చేసి పొమ్మంటే ఎందుకు పోవాలి. తినో, తినకనో ఉంటూ కొనుకున్న ఇల్లు ఇది. కట్టుకున్నపుడు ఏం చేశారు. మా జీవితాలతో చెలగాటమాడుతున్నారు. మమ్మల్ని బలవంతంగా పంపాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినందుకు తగిన శాస్తి జరిగింది మాకు.

- కవిత , న్యూమారుతీనగర్, చైతన్యపురి

నట్టేట ముంచుతున్నరు

ఇరవై ఏండ్ల నుంచి ఇక్కడే ఉంటున్నాం. ఇద్దరు పిల్లలున్నారు. లోన్ తీసుకుని ఇల్లు కట్టుకున్నాను. ఇప్పుడు మీ ఇల్లు ఎఫ్‌టీఎల్‌లో ఉంది.. ఖాళీ చేసి వెళ్లమనడం ఎంత వరకు సమంజసం. నా కష్టార్జితమైన ఇంటిని ఎలా వదులుతాం. ప్రజాపాలన అంటూ ప్రజలను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అవుతుంది.

- ఉమా మహేశ్వర్‌రావు, న్యూమారుతీనగర్, చైతన్యపురి

రిజిస్ట్రేషనప్పుడు తెలువదా?

కష్టపడి ఇల్లును కట్టుకున్నాం. ఇంటి రిజిస్ట్రేషన్ చేసేప్పుడు ఇల్లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని తెలువదా. మా ఇంటికి వంద మీటర్ల దిగువన మూసీ నది ఉంది. ఒక వేళ మా కాలనీలోకి మూసీ నది నీళ్లు వచ్చినట్లయితే దిగువన ఉన్న ఏ గ్రామం మిగలదు. పేదల భూములు గుంజుకుని రియల్ ఎస్టేట్ దందా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూస్తున్నాడు.

- వెంకటేశ్, న్యూమారుతీనగర్, చైతన్యపురి

ప్రాణం పోయినా కదలం

పూల వ్యాపారంతో కుటుంబాన్ని పోషిస్తున్నాను. నా భార్య నిండు గర్భిణీ. నా చెల్లండ్లు ఇక్కడే దగ్గర చదువుకుంటున్నారు. అధికారులు ఇప్పుడు వచ్చి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తాం.. ఖాళీ చేయమంటే ఎలా? ప్రాణం పోయినా ఇక్కడే ఉంటాం.. ఇల్లు మాత్రం ఖాళీ చేయం.

- మహేశ్ , న్యూమారుతీనగర్, చైతన్యపురి

మమ్మల్ని బతుకనివ్వు రేవంత్

ఇవి అక్రమ నిర్మాణాలు కాదు. కబ్జాలూ కావు. పక్కా పట్టాభూములు. మూసీ సుందరీకరిస్తానంటే దానిపై బ్రిడ్జిలు కట్టుకోమను. మా ఇండ్ల జోలికి రావొద్దు. మా బతుకు మమ్మల్ని బతుకనివ్వు రేవంత్‌రెడ్డి..హైదరాబాద్‌లో ఓట్లు పడలేదని ఇలా చేస్తున్నావా? మాకు డబుల్ బెడ్‌రూమ్‌లు వద్దు.

- కుర్మయ్య, మేస్త్రీ, న్యూకమలానగర్,అంబర్‌పేట

ఇదో పెద్ద కుంభకోణం

మూసీ సుందరీకరణ ఒక పెద్ద కుంభకోణం. రేవంత్‌రెడ్డి గరీబోళ్లను రోడ్డున పడేయడానికి చూస్తున్నాడు. సొంతంగా కట్టుకున్న ఇంటిని అక్రమం అంటున్నారు. గరీబోళ్లను ఆగం చేస్తున్నారు. ఇండ్లు కూలుస్తారని భయంతో వణికిపోతున్నారు ఇక్కడి జనాలు. మా పేదల బతుకులను రోడ్లున పడేయొద్దు.

-సంజీవ,తులసీరాంనగర్, గోల్నాక, అంబర్‌పేట